

# అనగనగా ఓ మంచి కథ

## ఆట వస్తువు

### కోమలాదేవి

*( ఆంధ్రజ్యోతి వారపత్రిక, 1968 జనవరి 5)*




**ఆఫీసులో చిన్న రకం అలజడి ప్రారంభమైంది.**

ఎందుకు? అప్పుడే ఆఫీసులో కాలుపెడుతున్న ఉద్యోగస్తులు గుంపుగా కూడి మాట్లాడుకుంటున్న సహచరులను సమీపించి అడుగుతున్న మొదటి ప్రశ్న ఎందుకు?

"మన ఆఫీస్‌లో ఫెయిర్ సెక్స్‌కు స్థానం వుందని"

"ఆమె పేరు శాంతాదేవి అట"

"నిన్ననే రావలసింది. రాలేదు, ఇవ్వాళ తప్పక వస్తుంది."

"ఆమెను ఎవరన్నా చూశారా?"

"ఆ...నే చూశాను.."

"ఎలా వుందోయ్. ఏ డిగ్రీ?"

"కంపారటీవ్ డిగ్రీ" విజయవర్ధన్ అన్నాడు.

"ఏడ్చావ్ – మొన్న నేను చూస్తే సూపర్‌లేటివ్‌లో వుంది" అప్పుడే వచ్చిన అశోక్ అన్నాడు.

అందరూ వింతగా అతనివైపు చూశారు. కాస్త గట్టిగా, సీరియస్‌గా అనబట్టి వారందరు అలా చూశారు.

“వస్తుందిగా. చూద్దాంలే” వయసు మించిపోతున్న ఒక క్లర్క్ అంటూ తన కుర్చీ దగ్గరకి వెళ్ళాడు.

గంట కావడంతో అందరు తమ తమ స్థానాల్ని అలంకరించారేగానీ పని మాత్రం మొదలు పెట్టకుండా ఏదో బిజీగా వున్నట్లు నటిస్తున్నారు.

ఆమె అడుగు పెట్టింది.

ఆఫీస్‌లో పిన్‌డ్రాప్ సైలెన్స్.

అందరూ ఒక్కసారి తలెత్తి చూశారు.

ఫరవాలేదనుకుని ఎవరేమనుకుంటారోనని తలొంచుకున్నారు.

ఆమె మెల్లగా లోపలికెళ్ళింది. ఆఫీసర్ హల్లో అనటం విన్నారందరు. ఎవరివారు విచిత్రంగా నవ్వుకున్నారు.

కొంతసేపటికి ఆమె బైటికొచ్చింది. చేతిలో కొన్ని కాగితాలు. సరాసరి తన సీట్‌లో కూర్చుంది. ఆమెకు మిగతా వారికి మధ్య పెద్ద బీరువా.

ప్చ్!

శాంత తెల్లటి చీర కట్టుకుంది. తెల్లటి రవిక వేసుకుని ఒంటిపేట ఫ్యాన్సీ ముత్యాలహారం వేసుకున్నది. పచ్చని పసిమి ఛాయతో ఆమె చూడటానికి అందంగా వుంది.

నుదుట బొట్టులేదు. చేతులకు లావుపాటి ఫ్యాన్సీ ప్లాస్టిక్ గాజు. అది గమనించినవారు 'అయ్యో' అనుకుని వెయ్యి ఆశ్చర్యార్ధకాలు పెట్టుకుని ఏమీ తోచక తికమకపడిపోతున్నారు.

ఆఫీసర్ విశ్వనాథ్‌గారికి ఆమె సెక్రటరీగా వుంది.

అతను చాలా మంచివాడనీ – దొడ్డబుద్దిగల వాడనీ వినికిడి.

అవుతేనేం అతడు మగ మహారాజు.

ఆ సాయంత్రం – అశోక్ గెలిచాడు ఆమె అందం సూపర్ లేటివ్ డిగ్రీ దాటినట్లు ఓట్లు ఎక్కువ పడ్డాయి.

ఇళ్ళకు బయలుదేరారు.

ఆమె రిక్షా కోసం మెట్లమీద నుంచుంది.

అశోక్ ముందుకొచ్చాడు. అతడు అవివాహితుడు. అందగాడు. ఒక సెక్షన్‌కు అధికారి. ఆరువందల జీతం వస్తుంది. మంచి మాటకారి. కలుపుకోరుతనం వుండటం చేత అందరికీ అతనిపైన సదభిప్రాయం వుంటమే కాకుండా అందరూ స్నేహితులైపోయారు. అతని క్వాలిఫికేషన్స్ శాంతకు సరిపోతాయి. కానీ...

"రిక్షాకోసం కనిపెట్టుకుంటే చాలా ఆలస్యమైపోతుంది. బస్‌స్టాప్ ఇంకొద్ది దూరంలో వుంది. చూపిస్తాను రండి."

ఆమె కృతజ్ఞతతో చూసి "థాంక్యూ" అంటూ అతన్ననుసరించింది. విజయవర్ధన్ దూరం నుంచి చూసి తన దారి తాను వెళ్ళిపోయాడు.

మరుసటిరోజు ఆమెను గూర్చి తెలిసిన వివరాలన్నీ సహచరులకు చెప్పాడు. ఆమెకు పెళ్ళికాలేదు. ఇల్లు హిమాయత్ నగర్‌లో వుంది. తల్లి ఒక తమ్ముడు తప్ప ఇంకెవరూ లేరు. బి.ఎ చదివింది. ఇక్కడికి క్రొత్తగా వచ్చారు. ఆమె మీద ఆధారపడి వున్నారు. కొద్దిగా పొలం కృష్ణా జిల్లాలో వుందట.

"బాగుందండీ రిపోర్ట్. అయితే..." ఒకతను మాటలు నాన్చాడు.

"అయితే.. మీ అభిప్రాయమేమిటి?..." ఫక్కున నవ్వి వెళ్ళిపోయాడు అశోక్.

కాఫీ టైములో ఆమెను రమ్మన్నారు. శాంత ఏదో చెప్పుకుని తప్పుకుంది.

రెండవరోజు మరొక గ్రూప్ ఆహ్వానించింది. ఆమె ఎలాగో జారుకుంది. వీళ్ళందరికీ కష్టంగా వుంది.

శాంతకు తోచదు. అర్ధంకాని తనకు క్రొత్తగా వున్నవి ఎవరినైనా అడిగి తెలుసుకునేందుకు భయం. తనకన్నీ అపరిచితమైన పనులే. ఏం చెయ్యాలి. రెండు రోజులు ధైర్యంగా బాస్‌ను అడిగింది.

ఆయన చిరునవ్వుతో బోధపర్చి పంపారు. మరి సతతం ఎలా జరుగుతుందీ? శాంతకు రానురాను అనుమానాలెక్కువైపోతున్నాయి.

వారం రోజులకు తనకు చాలా కష్టమనిపించింది.

ఒక్కతే కూర్చుని కాఫీ త్రాగుతోంది. ఎవరో ఒకామె తనముందు ఖాళీ సీట్‌లో కూచుంది. మాటామాటా మాట్లాడుకున్నారు.

"ఓ.. మీరు శాంతాదేవిగారేనా? మా వారు స్టోర్ కీపర్‌గా వున్నారు... ఆ.. మీ ఆఫీస్‌లోనే. పేరు లక్ష్మీకాంత్. మీరు వచ్చినట్లు చెప్పారు."

శాంత ఆమెతో మాట్లాడిన ఆ కొద్దిసేపట్లో ఆత్మీయురాల్ని చూసినట్లు ఫీల్ అయింది. ఆమె శాంతను చిన్న చూపు చూస్తూ నిరాశావాదిగా మాట్లాడలేదు. పురుషుల మధ్యలో పనిచేస్తున్న "మామూలు" రకం అమ్మాయి అనిపించేట్లు పలకరించలేదు. శాంత విషయం అన్నీ తెలిసినట్లు మాట్లాడుతుంటే ఆమెకు ఆశ్చర్యం వేసింది.

"బజారునుంచి వస్తున్నాను. మా వారు వస్తుండాలి. ఇక్కడ కలుసుకుందామనుకున్నాము" అంతలోకి లక్ష్మీకాంత్ రానేవచ్చాడు.

పరస్పర పరిచయాలయ్యాక ఆమె శాంతను ఆహ్వానిస్తూ అంది.

"ఈ ఆదివారం తప్పక మా యింటికి రావలి. మీ అన్నయ్యగారు నేను కలిసి ఆహ్వానిస్తున్నాము."

శాంతకు ఏం చేయాలో తోచలేదు.అంగీకరిస్తూ తలాడించింది. వాళ్ళ స్నేహం ఆ విధంగా అభివృద్ధి చెందింది.

"పిచ్చిదానా నేనూ నీలాగే మడిగట్టుకుని కూర్చున్నాను సుమా కానీ వీళ్ళూరుకుంటారా? వాళ్ళకు నచ్చినట్లు మనం మసలకపోతే ముప్పతిప్పలు పెడతారు. ఎలా వుండాలంటే.."శాంత చెవులో మంత్రోపదేశం చేసింది స్వర్ణలత.

శాంతకు ఆ మంత్రాన్ని జీర్ణించుకోవటమ కష్టమనిపించింది. ఇబ్బందిపడిపోతూ చూసింది.

“నిప్పుకు దగ్గరగ వెళితే వెచ్చగా హాయిగా వుంటుంది. ముట్టుకుంటే కాలిపోతుంది" శాంత భుజం చుట్టూ చేయివేసి నవ్విందామె.

మరుసటి రోజు లక్ష్మీకాంత్ మెల్లగా శాంత దగ్గరకి వెళ్ళాడు.

"ఏమ్మా వస్తావా కాఫీ తాగుదాం.” మారు మాట్లాడకుండా అతనివెంట వెళ్ళింది. ఆ గంట సరదాగా గడిచింది. మరి నలుగురు ప్రోగయ్యారు.

శాంతకు కాఫీ ఖర్చు పడలేదు.

రోజుకొకరు ఆమెను ఆహ్వానిస్తున్నారు. రెండు రోజులు చూసి మూడవరోజు తన బిల్లు తానే చెల్లించింది.

శాంతకు పని సాఫీగా నడుస్తోంది. తాన పని చురుకుగా సాగుతోంది. అందరికంటే ఎక్కువ అశోక్ ఆమె వెంట కనిపిస్తున్నాడు. వారిద్దరిని చూడగానే మిగతావారు అర్ధవంతంగా మందహాసం చేస్తారు.

ఆవేళ సాయంత్రం రామ్మోహన్ ఆమె దగ్గరకొచ్చాడు. "శాంతగారూ ఈవేళ నాతో బజారుకు రాగలరా?"

"ఎందుకు?"

"మా ఆవిడ పుట్టినరోజు రేపు. మంచి చీర కొనాలని. కానీ నాకు సమంగా బేరమాడటం రాదు. గుడ్డ నాణ్యాన్ని ఎన్నిక చేయలేను."

"అరె. నాకూ తెలియదు. ఈ ఊరు క్రొత్త. సిటీలలో మోసాలెక్కువకదా. బాగా ఎరిగున్నవారిని తీసుకెళ్తే."

"ఆ భయం అక్కరలేదు. మాకు తెలిసిన దుకాణమేనండీ. బెస్ట్. చీర సెలెక్ట్ చేయాలి. అంతే."

"మీ ఆవిడకు నచ్చకపోతే నన్ను తిట్టుకుంటారు.”

"మీరు సెలెక్ట్ చేశారని ఆమె కెవరు చెప్తారు? నేనే స్వయంగా సెలెక్ట్ చేసినట్లు ఇస్తాను..."

శాంత అతనికేసి వింతగా చూచింది. సరేనంది. అతడు అమితానందంతో వెళ్ళిపోయాడు.

శాంత ఇల్లుచేరేసరికి దీపాల వేళైంది.

"ఏమ్మా – శాంతా?" అని తల్లి పలకరించింది.

ఉన్నమాట చెప్పి అలసిపోయిన గుర్తుగా కుర్చీలో చేరబడింది. "ఏమిటోనమ్మా అందరితో కలిసిమెలిసి తిరిగా నా పని సులభం. అన్నింటికీ ఆదుకుంటారు. మీకూ నాకూ ఏమి సంబంధం లేదనుకుంటే ఆ పని చేయలేము. ఎక్కడికక్కడ పని కష్టమైపోతుంది. మొన్న చూడు. వాడికి మెడిసిన్ పుస్తకాలు కావాలంటే సెకండ్‌హేండ్‌వి తక్కువ ధరలో తెచ్చిచ్చారు.”

"ఏమో తల్లీ నీ ఇష్టం కానీ జాగ్రత్త."

ఆ "జాగ్రత్త"లో కొన్ని వందల పుస్తకాలు చదవగలదామె. ఇది మామూలైపోయింది. "పాప పుట్టిన రోజనీ, చెల్లి పుట్టిన రోజు"అనీ షాపింగ్‌కు తిప్పుతున్నారు.

శాంతకు ఇలా తిరగటం అలవాటైపోయింది.

ఆరోజు పార్టీ అయింది. ఆలస్యమైపోయింది. శాంత ఇంటికి వెళ్ళటానికి బస్‌స్టాప్ దగ్గరకు గబగబా వెళ్తోంది.

"మిస్ శాంతాదేవీ" ఎవరో మెల్లగా పిలిచారు.

ఆమె వెనక్కు తిరిగింది.

విజయ్ నుంచుని వున్నాడు. "చాలా ఆలస్యమైంది ఈ రూట్ బస్సుకు ఆక్సిడెంట్ అయింది. ఇంకో అరగంటకుగాని రాదట. నడిచి వెళ్దామా?"

ఇద్దరూ నడక ప్రారంభించారు. ఏవో కబుర్లు చెప్పుకుంటూ వెళుతున్నారు. "మిమ్మల్ని సినిమాకు తీసుకెళ్ళాలనుకున్నాను. ఎందుకో మానుకున్నాను."

"దేనికి?"

అతను మాట్లాడలేదు. ఆమెకూడా ఆవిషయాన్ని ప్రస్తావించలేదు.

ఇల్లు చేరేసరికి ఎనిమిది గంటలైంది.

విజయ్ గుమ్మం దగ్గర ఆగిపోయాడు కాని వెళ్ళిపోయే ప్రయత్నం చెయ్యలేదు.

"లోపలికి రండి" ఆహ్వానించిందామె.

అతను కాసేపు కూర్చుని తల్లిని ఆమె తమ్ముడిని పలకరించి వెళ్ళిపోయాడు.

"మంచివాడిలా వున్నాడే శాంతా" అందామె.

"ఆ... మంచివాడే.. నడిపించుకొచ్చాడు. ఒద్దుబాబు రిక్షా ఎక్కుతానన్నా విడిచాడు కాదు..ష్" అంటూ ఈజీ చెయిర్‌లో పడుకుంది.

తన బిడ్డకి ఎంత కష్టం వచ్చి పడిందనుకుంది మనసులోనే మధనపడిందామె.

రాను రాను మిగతావాళ్ళు జారుకున్నారు.

ఒక్క అశోక్ ఆమెను వెన్నంటి తిరుగుతున్నాడు.

"మిస్ శాంతా మంచి ఇంగ్లీష్ పిక్చర్ వచ్చింది. రేపు మ్యాట్నీకి వెళ్దాము"

శాంతకి ఇష్టంలేదు. లేడీ ఫ్రెండ్స్‌తో లేక భర్తతో వెళ్ళి ఇంగ్లీష్ సినిమాలు చూడవచ్చుగానీ పరాయివాడితో వెళ్ళి చూడడం ఆమెకు సుతరామూ ఇష్టంలేదు.

"నాకు మ్యాట్నీ చూస్తే తలనొప్పి వస్తుంది. నేను రాలేను."

"అరె. మరీ మంచిది. నైట్ షోకి వెళ్దాం."

"వద్దండీ. చాలా ఆలస్యమైపోతుంది. రాత్రి వెళ్ళటం కష్టం. మీరు వచ్చి దిగబెట్టినా మీకు ఆలస్యమైపోతుంది."

"నాకేం కష్టంలేదు. సరదాగా వెళ్దాం."

అశోక్ తనకెన్నో డ్రాఫ్ట్ స్ రాసిస్తుంటాడు మరి. అందుకని ఇంత చొరవ తీసుకుని అడుగుతున్నాడు.

ఆసారి సినిమా చూశాక చెరొక రిక్షా చేసుకున్నారు.

రెండవసారి సినిమానించి బయటికి రాగానే ఒక్క రిక్షా బేరం చేశాడు. శాంత గాభరాగా చూస్తోంది.

ఒకవేళ తను మళ్ళీ బేరం చేసుకుంటాడేమోఅనుకుంది. అశోక్ ఆ ప్రయత్నం ఏమీ చేయలేదు. ఆమె ఎక్కి కూర్చున్న తర్వాత ఎక్కబోయాడు.

"అశోక్ గారూ ఇది భారతదేశం దయచేసి మరొక రిక్షా తీసుకోండి" జాలిగా అంది.

అశోక్ నవ్వాడు. "అరే మీకూ ఈ నేరోమైండెడ్‌నెస్ పోలేదన్నమాట" అంటూ వేరే రిక్షా ఎక్కాడు.

ఆ నవ్వులోని అంతరార్థం గ్రహించటానికి శాంతకి ఎక్కువసేపు పట్టలేదు.

కానీ.. కొన్నాళ్ళకు శాంత పూర్తిగా మారిపోయింది. పదిమందిలో నవ్వుతూ మాట్లాడుతూ సరదాగా తిరుగుతోంది. నయనద్వయం కాంతి పుంజాలయ్యాయి. ముఖంలో అపూర్వమైన ఆనందం వుట్టి పడుతోంది. హృదయం తృప్తితో పరిపూర్ణత చెందింది. కారణం అశోక్ తనపై వేరే అభిప్రాయం కలిగి వున్నాడు. అది కేవలం స్నేహం కాదు. స్నేహానికి మించినది. అతడు ప్రేమిస్తున్నాడు కానీ.. ఆమె గ్రహించింది.

అతని నోటినించి ఆమాట వినేవరకు కాస్త హద్దులో వుండాలని మితిమీరి వ్యవహరించకూడదని తెలుసుకుంది.

సంధ్యవేళ దాటింది. బస్ దిగి గబగబా నడుస్తోంది. ఇల్లు మూడు ఫర్లాంగుల దూరంలో వుంటుంది. పేవ్‌మెంట్ మీద తలొంచుకుని వెళ్తోంది. టప్ టప్ మంటూ స్కూటర్ ఆమె ప్రక్కగా ఆగింది.

తృళ్ళిపడి చూసింది. అశోక్ స్కూటర్ మీద కూర్చుని చిరునవ్వులు చిందిస్తున్నాడు. ఆమె హృదయంలో ఆనందం పురివిప్పి నాట్యమాడింది.

"శాంతా వెనకమాల ఎక్కు. ఇంకా మీ ఇల్లు చాలా దూరం వుంది కదూ."

"ఫరవాలేదు. ఇలా వెళ్తాను. మీరు వెళ్ళండి" అంటూ నడక సాగించింది.

ఈ వీధంతా తనకు బాగా తెలుసు. ఎవరైనా చూస్తే అన్న సంకోచంతో ఆమె ముందడుగు వేసింది.

"సిల్లీ గర్ల్" అంటూ స్కూటర్‌ను ఆమె ప్రక్కగా రానిచ్చాడు.

"నిన్నిలా వదిలి వెళ్ళటానికి మనసొప్పటం లేదు. ఎక్కు శాంతా"

మిస్. శాంతాదేవి అనటం నెలరోజులైంది. శాంతాదేవి కాస్తా శాంతా అయింది. ఆమె తటపటాయిస్తూ నుంచున్నది.

"ఇలా ఎక్కటం అసభ్యంగా వుంటుందేమో."

"మైగాడ్. నువ్వు పల్లెటూరులో వుండవలసిన దానవు. ఎక్కు శాంతా గొడవ చేయకు."

శాంత ఎక్కింది. అతన్ని తాకకుండా సీట్‌ను గట్టిగా పట్టుకుంది. స్కూటర్ రయ్యిన గాలిని దూసుకుంటూ సాగిపోయింది. ఆమె అనుకున్నట్లు రెండు ఫర్లాంగులలో ఇల్లు చేరలేదు. ప్రక్క రోడ్డెక్కి తిన్నగా మెయిన్ రోడ్డెక్కాడు. ఇది గ్రహించి ఆమె వారించబోయింది

గానీ  అశోక్ వినిపించుకోలేదు. దాదాపు గంటసేపు షికారు కొట్టి తిన్నగా ఇంటికి కాస్తదూరంలో ఆపాడు. గాభరాగా దిగింది. ఆమెకు ఏమనాలో కూడా తోచలేదు. అతను ఇంటిదాకా రానందుకు దిగులు పడింది.

"ఇంతసేపు తిరిగాము. లోపలికి రాకూడదూ?"

"ఆలస్యమైపోయింది. మరొకసారి వస్తానులే శాంతా" అంటూనే స్కూటర్ త్రిప్పుకున్నాడు.

తల్లి కూతుర్ని ఏమీ అడగలేదు. మరుసటి రోజు స్వర్ణలత, లక్ష్మీకాంత్ వాళ్ళింటికొచ్చారు. మాటా మాటా మాట్లాడుతూ స్వర్ణ మెల్లిగా కదిలించింది.

"అత్తయ్యా మన శాంత వాళ్ళాఫీసులో అశోక్ వర్ధన్ అనే అతను పని చేస్తున్నారు. వారికి శాంత అంటే ఒక విధమైన అభిప్రాయం వుంది. మనవాళ్ళే మీకేం అభ్యంతరంలేదనుకుంటాను" ఆమె చెవులారా అశోక్‌ను గురించి విన్నది.

"నాయనా లక్ష్మీ నువ్వే దీన్ని ఖాయం చెయ్యి. ఎలాగో మేము సర్దుకుంటాము. పెళ్ళికాని పిల్ల అంత చనువుగా తిరుగుతుంటే మీరంతా వూరికే చూస్తూ కూచుంటారా?"

లక్ష్మీకాంత్ చెంపలు పట్టుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. "స్వర్ణా..శాంత అభిప్రాయం ఎలా వుందో.!?"

ఆమె నవ్వింది "అతనితో అంత చనువుగా తిరుగుతోందే ఇక దీన్ని ప్రేమ అనక ఏమంటారు?"

లక్ష్మీకాంత్ తప్పే అన్నట్టు చూశాడు.

"చూస్తానులెండి పిన్నీ. మీరేం కంగారు పడొద్దు"

"ఇంతదాకా వచ్చాక కంగారు కాక మరేమిటి నాయనా?"

అప్పుడే విజయ్ లోపలకివచ్చాడు.

"ఏమిబాబూ విశేషం? క్షేమమా?" పలకరించిందామె.

"క్షేమమేనండీ శాంతగారు సర్కస్ చూడటానికి వెళ్ళారు. మీకు చెప్పమన్నారు."

"ఎవరెవరు వెళ్ళారేమిటి?"

"అశోక్ తాను మరికొందరు స్నేహితులతో వెళ్ళారు."

"బాబూ ఇంకా ఆడవాళ్ళున్నారా?"

"ఉన్నారండి – అంతా కలిసే వెళ్ళారు."

అందరు కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు.

ఇల్లు చేరగానే స్వర్ణ, లక్ష్మీకాంత్ నిశ్చయించారు. రేపే ఈ విషయం తేల్చి వేయాలని.

మరుసటి రోజు ఆఫీస్‌కి వెళ్ళగానే తెలిసిన సంగతి ఒక నెలరోజులు సెలవు పెట్టి అశోక్ ఎక్కడికో వెళ్ళినట్లు. విజయ్‌కు ప్రమోషన్ వచ్చి విశాఖపట్నం వేసినట్లు. విజయ్‌ను అభినందించి చాలా సంతోషించాడు లక్ష్మీకాంత్.

"అన్నట్లు అశోక్ చెప్పా పెట్టకుండా ఎక్కడికి వెళ్ళినట్లు?"

"వెళ్ళలేదు. ఈ సాయంత్రం ఇంటికి వెళ్తున్నాడట."

"ఓ.." అని మౌనం దాల్చాడు.

ఏదో స్ఫురించగానే చటుక్కున లేచి సెలవు చీటి రాసి బయలుదేరాడు. వెళ్తూ వెళ్తూ శాంతను గమనించాడు, ఆమె సీరియస్‌గా ఏదో రాస్తూ కూచుంది. ఆమెను పలకరించకుండానే వెళ్ళాడు.

తలుపు తట్టి నుంచున్నాడు లక్ష్మీకాంత్.

అశోక్ సామాను సర్దుకుంటూ తలుపు తెరచి వచ్చిన వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయాడు.

"హల్లో లక్ష్మీకాంత్ ఇలా వచ్చారు రండి రండి" కుర్చీ చూపించాడు.

"ఎక్కడికో ప్రయాణమౌతున్నట్టున్నారు?" కూర్చున్నాడతను.

"ఆ.. సత్వరం రమ్మని నాన్నగారు వైర్ ఇచ్చారు. తెల్లవారి అందింది. ఇక వెంటనే బయలుదేరాలిగా మరి?"

"ఏదైనా మంచి ఉద్యోగమా?"

"లేదనుకుంటాను. నాకేం అర్థం కావటంలేదు. ఎందుకు రమ్మన్నారో"

ఏదో మాట్లాడుకుంటున్నారు. ఉన్నట్లుండి అశోక్ అడిగాడు.

"ఆఫీస్‌కు సెలవు పెట్టి వచ్చారు. నాతో అర్జంట్ పనుందా?"

"ఆ.. మీరు వెళ్తున్నట్లు తెలిసింది. రాత్రి శాంత అమ్మగార్ని కలిశాం. శాంత విషయంలో ఆమె ఆందోళన చెందుతున్నారు."

"ఎందుకు? ఆమెకెందుకు అంత ఆరాటం?"

"ఎందుకంటారేమిటి అశోక్. ఆమె కూతురుతో మీరు తిరుగుతున్నారు కదా. ఆ మాత్రం ఆవిడకు దీని అంతరార్థమేమిటో తెలుసుకోవాలని వుండదా?"

"మీరేమిటంటున్నారు. అంతరార్థం ఏముంది ఏమీలేదు" నిష్కర్షగా అన్నాడు.

"అశోక్ గారు మీరు అనేదేమిటి? హాస్యానికిది సమయంకాదు. శాంతను త్వరగా పెళ్ళిచేసుకోమని ఆమె తరపున అడగాటానికి"

అశోక్ చటుక్కున లేచి నుంచున్నాడు.

"ఆగండి ముందు ఒక్కమాట చెప్పనీయండి. శాంత పట్ల అటువంటి అభిప్రాయం నాకు లేదు"

"ఏమిటీ శాంతను మీరు ప్రేమించటం లేదూ?"

అశోక్ ఎగతాళిగా నవ్వాడూ. లక్ష్మీకాంత్‌కు మాటలు పడిపోయినయ్.

"శాంతను నేను ప్రేమించటమా? ఎలాంటి ప్రశ్న వేశారు." అతడు పగలబడి నవ్వాడు. ఆ నవ్వు వికృతంగా ధ్వనించింది.

"ఇది ఉట్టి పుకారు కాదు అశోక్. స్వయంగా శాంత మా ఆవిడతో అంది."

"నాకు తెలుసు. అటువంటి ఆమె ఎంతకైనా తగునని" సీరియస్‌గా అన్నాడతను.

"మాటలు జాగ్రత్తగా రానివ్వండి. ఒక స్త్రీని గూర్చి అంత చులకన చేసి మాట్లడటం తగదు. ఐతే మీరు శాంతను ప్రేమించటంలేదూ?"

"లేదు. ఎప్పటికీ లేదు" సిగరెట్ వెలిగించి దాని వంక తదేకంగా చూశాడు.

"ఐతే ఆమెతో ఎందుకు తిరిగారు? ఆమెకి ఇష్టంలేకపోయినా బలవంతంగా సినిమాలకి ఎందుకు తీసుకెళ్ళారు. వద్దనే కొలది టిక్కెట్స్ ఎప్పుడూ మీరే ఎందుకు కొన్నారు. రిక్షాలో ఆమె ప్రక్కలో కూర్చోవాలని ఎందుకు తహతహలాడారు? టీ టైములో ఆమెను విడవకుండా ఇన్ని నెలలెందుకు వెన్నంటి తిరిగారు? వాళ్ళ రూట్‌లో బస్సు రానప్పుడు, ఆమెను స్కూటర్ మీద తీసుకెళ్తానని మీ వాళ్ళ దగ్గర పందెం ఎందుకు వేశారు. ఆమె వద్దనే కొద్దీ స్కూటర్ మీద కూర్చోపెట్టుకుని వూరంతా ఎందుకు త్రిప్పారు? ఆమెపై ప్రేమలేకపోతే ఇలా ఎందుకు చేశారు?" సూటిగా అతనికేసి చూశాడు.

"ఎందుకు చేశాను? నేనెందుకు చేశాను? ఆమె లోలోపల సుముఖంగా వుందని నాకు తెలుసు. ఒక్కసారైనా ఖచ్చితంగా నాతో 'మీతో రాను' అని చెప్పలేదు" పెదిమలు విరిచి చేయి తిప్పాడు.

"ఆమె మీతో కచ్చితంగా చెప్పలేదని కదూ అంటున్నారు? మీరు తనను ప్రేమిస్తున్నారని కటువుగా మాట్లాడితే మీకు కోపం వస్తుందని భయపడింది. అది సహజమే కదా మీది నిజమైన ప్రేమ అయివుంటే ఆమె నిరాకరిస్తే ఎంతగానో బాధపడి వుందురు. మీ ప్రవర్తనకు ప్రేమకు సంబంధం లేదని ఆమెకేం తెలుసు? పోనీయండీ. ఇంతవరకు వచ్చిన తర్వాత మరొక్కటి అడుగుతున్నాను. శాంతను చేసుకోటానికి మీకు అభ్యంతరం ఏమిటి?"

అతను భృకుటీకరించి వింతగా చూశాడు.

"ఏమిటి శాంతను నేను చేసుకోవటమా?" ఎంతో విడ్డూరమైనట్లు అన్నాడు.

"ఏం ఎందుకు పెళ్ళాడరాదు? మీరే  కదూ ఆమె అందం సూపర్‌లేటివ్ డిగ్రీ దాటుతుందన్నారు. ఆమె విషయం మీకు తెలిసినంతగా మాకెవ్వరికీ తెలియదే. పైగా ఆమెది ఏదో వేరే కులం కూడా కాదు. అన్నింటికీ తగినది. పైగా మీ ఇద్దరు వివాహం చేసుకోబోతున్నారని అందరికీ తెలుసు."

"ఎలా అనుకంటారు మీరు? నేనెప్పుడూ ఎవ్వరి దగ్గర అనలేదే?" అతడు విసుక్కున్నాడు.

"అంతేకాదు. మాదెంతో ఉన్నత కుటుంబం – వంశ మర్యాదకు ప్రాధాన్యత ఇస్తారు మా వాళ్ళు. బ్రతుకు దెరువులేక మగవాళ్ళమధ్య ఉద్యోగం చేస్తూ వాళ్ళతో తిరిగే శాంత.. వాళ్ళకు సరదా తీరటానికి, సంతోషింపచేయటానికి తాపత్రయపడే శాంత నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వని ఆమెను పెళ్ళాడటం కలలో మాట."

లక్ష్మీకాంత్ నోటమాట రాక విస్తుపోయి చూస్తున్నాడు. అతి ప్రయాసతో ఉద్రేకాన్ని అణచుకుని మెల్లగా అన్నాడు.

"ఐతే మిస్టర్ తెలీక అడుగుతున్నాను ఆమెనిలా తయారుచేసింది మీరు కాదూ? తనపాటికి తనుంటే పూరుకున్నారా? క్యూలు గట్టి ఆహ్వానాలు జారీ చేసేవారే. రానంటే బలవంతం చేసేవారే. పోనియ్. ఇది అర్థంకాలేదు చెప్పండి అంటే అయిష్టంగా ఏదో అని తప్పుకున్నారే. అన్ని తప్పులు చెప్పి పంపేశారే. మొదటి నెలలో ఆమెకు కంటికి నిద్రరాకుండా చేశారే. సరిగ్గా చెయ్యకపోతే ఈ ఉద్యోగం కూడా ఊడిపోతే తమ గతేం కానని ఆమె ఎంతగా విచారించి ఆందోళన చెంది వున్నదో ఆలోచించారా? ఈ కాలం ఉద్యోగాలు దొరకని క్లిష్టపరిస్థితుల్లో ఆమెను ఆమె పాటికి వదల్లేదే. మీరు దారి కాచి ఆమెను సినిమాలకు, సర్కస్‌లకు, డ్రామాలకు హోటళ్ళకు లాక్కుపోయారే. ఆమెనలా నిస్సహాయురాలినిగా చేసింది మీరు కాదూ? నేను రానంటే పల్లెటూరి బైతు. అన్నది మీరు కాదూ. మీరే ఆమెనలా మార్చి చివరికి నైతిక విలువల్లో దిగజారిపోయినట్లు ఎంత అసహ్యంగా మాట్లాడుతున్నారు" అతడు నుదురు చేతి రుమాలుతో ఒత్తుకున్నాడు.

"శాంత.. ఆమె మీ వలలో పడలేదు. తన పవిత్రతను తన గౌరవాన్ని కాపాడుకుంది. ఆమె మోసపోయి సర్వనాశనమైపోలేదు" వస్తాను అంటూ తిరిగి వచ్చేశాడు.

"చిల్లర మల్లరగా తిరిగే పిల్లను నేను పెళ్ళాడాలట" స్వగతంగా అనుకుని నవ్వుకున్నాడు.

కబురు భర్తద్వారా విన్న స్వర్ణలత వున్న పళంగా శాంతా వాళ్ళింటి కెళ్ళింది. ఆమెకేం చెప్పాలో ఎలా చెప్పాలో అగమ్య గోచరమైపోయింది. భారభరిత హృదయంతో కూర్చున్న స్వర్ణవైపు నిశ్చలంగా చూచిందామె.

"ఏమైందమ్మా – మా శాంత సంగతేనా?"

"ఔను అత్తయ్యా. అతడికట.. మరే..." ఆమె రెండు చేతులు గుండెలమీద పెట్టుకుని కళ్ళు గట్టిగా మూసుకుంది.

"తెలుసమ్మా.. అతగాడు.. తప్పుకున్నాడు. అంతేగా."

"అంతే అత్తయ్యగారూ మీ అబ్బాయి చెడామడా తిట్టి వచ్చారు. ఏం లాభం. శాంతకి ఈ కబురెలా చెప్పాలో నాకు అర్ధంకావటంలేదు."

"ఏం చెయ్యను తల్లీ అంటీ అంటనట్లుంటే అందరు స్ట్రయిక్ చేశారు. కలసిమెలసి వుంటే ఇలా చేస్తారు. ఆమె నాలుగు రాళ్ళు తేవాలి. ఈ సంసారం గడవాలి. ఏం చెయ్యను స్వర్ణా." ఆమె కన్నీరు మున్నీరుగా ఏడ్చింది, "అమ్మా అతనితో బజారెళ్ళాను. అతనితో దుకాణానికి వెళ్ళాను. ఫలానా వాడితో వెళ్ళలేదని నాకు ఫైల్స్ సమయానికి అందివ్వలేదు. అలాగైతే ఆఫీసర్ చీవాట్లు వేస్తాడని ఆయనతో సినిమాకెళ్ళాను నన్ను చూస్తే చనిపోయిన చెల్లి గుర్తొస్తుందట. ఏం చెయ్యనమ్మా. అని రోజూ నా తల్లి మొత్తుకునేది. వేరే ఎక్కడైనా దొరికితే బాగుండునని చూస్తూనేవున్నాగదా. ఒక్కసారి రెండొందలు ఆదాయం పోతే మేమేమైపోవాలి.

"జాగ్రత్త తల్లీ. అనేదాన్ని పాపిష్టిదాన్ని బిడ్డను ముప్పుతిప్పలు పెట్టాను. ఆమె హృదయ విదరకంగా రోదిస్తుంది" శాంతకు పెళ్ళవుతుందా స్వర్ణా?" అని పదిసార్లు ప్రశ్నించి శోకమూర్తి అయింది.

"నువ్వే చెప్పు. నేను చెప్పలేను"

స్వర్ణ రిక్షా వేసుకుని వెళ్ళేసరికి లంచ్ టైం అయింది.

శాంత స్వర్ణను చూసి ఆశ్చర్యంతో వచ్చింది.

"కాఫీ ఇక్కడ తీసుకోవద్దు. ఆ హోటల్‌కి వెళ్దాం పద."

శాంత మారు పలక్కుండా స్వర్ణను అనుసరించింది.

కాఫీ చప్పరిస్తూ అంది "అశోక్ సెలవుపెట్టి వెళ్ళాడట. తెలుసా శాంతా?"

"ఊ..టెలిగ్రాం వచ్చిందట."

"నీతో చెప్పి వెళ్ళాడా?"

"లేదు.."

"ఎందుకని? తెలుసా?"

"తెలీదు. బహుశ వెళ్ళకముందు రావచ్చు."

"ఆ నమ్మకం నీకుందా?"

శాంత చటుక్కున కప్పు సాసర్‌లో పెట్టింది. స్వర్ణ కళ్ళలోకి తరచి తరచి చూచింది ఆమె పెదిమలు స్వల్పంగా కంపించాయి, "స్వర్ణా. ఏమిటి నువ్వంటున్నది? నీకా అనుమానం ఎందుకొచ్చింది? చెప్పు. ఇలా రావటంలో అంతరార్ధం?" ఆతృతతో ప్రశ్నించింది.

స్వర్ణ తటపటాయిస్తూ కళ్ళు తప్పించేసింది.

"చెప్పు. స్వర్ణా ఏమైంది?"

"అతగాడు ఇంటికెళ్తున్నాడు. నిన్ను వివాహం చేసుకునే ఉద్దేశం అతడికి లేదట" స్వర్ణ ఖాళీ కప్పుకేసి చూస్తుండిపోయింది.

ఇంకెవరి ద్వారానైన వినుంటే శాంత నమ్మేదికాదుగానీ స్వర్ణ తన ప్రాణస్నేహితురాలు చెబుతుంటే నమ్మకుండా వుండలేక పోయింది.

ఆమె ముఖం వివర్ణమైంది. గుండె దడదడలాడింది. అయితే తనొక ఆట వస్తువన్నమాట. ఆ మాట తలంచుకోగానే ఆమెకు దుఃఖం పొర్లి వచ్చింది.

గాద్గదికంగా అంది "నీకెలా తెలుసు?"

స్వర్ణ వారిద్దరికి జరిగిన సంభాషణను విశదీకరించింది.

"పోనీ ఆమెను వివాహం చేసుకోటానికి మీ అభ్యంతరం ఏమిటంటే ఏదేదో వాగాడట. మహానుభావుడు. ఛీ.ఛీ వాడిని నమ్ముకుని మోసపోయావు నీవు."

శాంత హృదయం ఘనీభవించినట్లు అచేతనంగా వుండిపోయింది.

"పద. సెలవుచీటీ రాయి. ఇంటికెళ్దాం" స్వర్ణ శాంతను లేపింది.

యాంత్రికంగా నడిచి వెళ్ళింది. కొంతసేపటికి బైటికొచ్చింది.

ఆమె ముఖం పాలిబోయి కళావిహీనంగా వుంది.

ఇంటిదగ్గర విడిచిపెట్టి స్వర్ణ వెళ్ళిపోయింది.

శాంత ఈ హఠాత్ సంఘటనకు తట్టుకోలేక విలవిల్లాడిపోయింది.

ఇల్లు చేరేవరకు అతి ప్రయాసతో నిలద్రొక్కుకున్నది. ఇంట్లో అడుగుపెట్టగానే ఆమె అవమానభారంతో కృంగిపోయింది. దుఃఖం అవధులు దాటింది. తల్లి నిస్సహాయంగా చూస్తూ దూరం దూరంగా వుంటోంది. ఆమె హృదయంలోని బడబాగ్ని కూతురు గ్రహించరాదని తప్పుకు తిరిగిందామె.

కాలేజినించి వచ్చిన తమ్ముడు ఇద్దరినీ చూసి విస్తుపోయాడు.

తల్లి రహస్యంగా చెప్పింది. కబురు విన్న అతడి హృదయంలో తుఫాను చెలరేగింది.

"వాడిని ఏం చేస్తే పాపం?" పళ్ళు పటపటలాడించాడు.

"ఊరుకోరా నాయనా నీకు పుణ్యం వుంటుంది. అసలే అక్కయ్య అలమటించిపోతోంది. దాని దుఃఖం చెప్పలేను. మోసపోయిందిరా నాయనా. మోసపోయింది. ఆమె భార భరిత హృదయంతో బిగ్గరగా ఏడవలేక కన్నీరు మాటిమాటికి ఒత్తుకుంటున్నది.

శాంత భవిష్యత్తు ఎలా వుంటుందో అని ఆమె భయపడిపోతోంది.

ఆ రాత్రి అందరికీ నిద్ర కరువైంది.

మరుసటిరోజు ఆఫీస్‌లో గొడవ గొడవగా వుంది. రకరకాలుగా చెప్పుకుంటున్నారు.

"అశోక్ సెలవు పెట్టాడా? శాంత రిజైన్ చేసింది. అంతరార్థం?"

"అశోక్‌కు ఆమెను వివాహం చేసుకోవాలన్న కాంక్ష ఎప్పటికీలేదు. నాకు బాగా తెలుసు" కొందరు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

"ఔనోయ్ మీకు బాగానే తెలుసు. ఐతే ఒక చక్కని చుక్కను ఆటవస్తువులా ఆడుకుని వదిలివేయటంలోనే మీ సంగతేమిటో తెలుసుకోవచ్చు" నిరశిస్తూ అన్నాడొకతను.

"చక్కగా వెంటేసుకుని తిరగటానికి బాగా పనికొచ్చింది. తోడు తీసుకెళ్ళటం.సరదాగా పదిమందిలో అగుపించటం ఎంత హోదా ఎంత గౌరవం ఆమె వంక పదిమంది చూస్తుంటే అదొక ఆనందం.అంతేగాని ఆమెను మోసగించటంలో ఎంత నికృష్టుడైపోయాడో తెలుస్తోంది. ఛీ...ఛీ" చీదరించుకున్నాడొకతను.

అప్పుడే లోపలికొచ్చిన లక్ష్మీకాంత్ శాంత రిజైన్ చేసిందని విని చాలా బాధపడ్డాడు. "వారి బ్రతుకుదెరువెలా?" ఇదే ఆలోచనతో ఆ రోజంతా గడిపాడు.

శాంతను వెళ్ళి పలుకరించటానికి ఆ భార్యా భర్తలకు ధైర్యం చాలలేదు.

మరుసటి రోజే విజయ్ విశాఖపట్నం వెళ్తున్న సందర్భంగా పార్టీ ఏర్పాటుచేశారు. గంభీరంగా నిశ్శబ్దంగా పార్టీ అయిపోయింది. వారం రోజుల్లో అతనూ వెళ్ళిపోతాడు.

లక్ష్మీకాంత్‌కు స్నేహితులే కరువయ్యారు.

యాంత్రికంగా ఆఫీస్‌కు వెళ్ళి వస్తున్నాడు.

నాలుగురోజులు పోయాక స్వర్ణకు శాంతనించి లేఖ వచ్చింది.

"...ఇల్లు ఖాళీ చేస్తున్నాము. నేను మళ్ళీ మీకు రాస్తాను. అంతవరకు నన్ను కలుసుకోటానికి ప్రయత్నించవద్దని బ్రతిమాలుతున్నాను. అమ్మా నేను మా పల్లెకి వెళ్ళాలని తమ్ముడ్ని హాస్టల్లో చేర్పించాలని, ఆ కాస్తపొలం అమ్మితే, నాకు మరెక్కడైనా పనిదొరికేవరకు సర్దుకుపోవచ్చును. ఈ ఉద్యోగం గొప్ప పాఠం నేర్పింది." స్వర్ణ కన్నీరు ఒత్తుకుని భర్త కోసం నిరీక్షిస్తూ కూచుంది.

అందరితో కలిసిమెలిసి తిరగమని తానుకదూ చెప్పింది. కానీ ప్చ్.. ఇలా అవుతుందనుకుందా? తనకూ లక్ష్మీకాంత్‌కు ఇలాగేనా పెళ్ళవుతా!

స్వర్ణ ప్రతిరోజు విధిగా పోస్టుకోసం నిరీక్షిస్తోంది.

కానీ శాంతనించి ఏ కబురూ లేదు.

పక్షం రోజులు గడిచిపోయాయి.

హటాత్తుగా లేఖ వచ్చింది.

ఆతృతతో తెరిచి చూచింది స్వర్ణ.

సాంతం చదివి ఆనందంతో ఉక్కిరిబిక్కిరైంది.

అది విజయ్ రాసిన లేఖ "...శాంతను నేను ప్రథమ వీక్షణంలోనే ప్రేమించాను. కానీ నాలో ఏదో బలహీనత. కులాంతర వివాహానికి ఆమె అంగీకరిస్తుందో లేదో ఒకసారి వారింటికెళ్ళి ఆమె తల్లిని చూశాను. నా అనుమానం ధృఢమైంది. అన్ని విధాల తగినవాడు అశోక్ వుండగా నేనెంత అనుకుని ఆమెకు నా ప్రేమ విషయం అజ్ఞాతంగానే వుంచానుగానీ ఆమెను పిచ్చిగా గాఢంగా ప్రేమించాను. శాంత ఇంటికెళ్ళిందని ఆమె తమ్ముడు రఘునాథ్ చెబితే వెంటనే వెళ్ళాను. శాంతను ఒప్పించటానికి కష్టమైందిగానీ ఆమె తల్లిగారు వెంటనే అంగీకరించారు. మూడు రోజుల క్రితం విజయవాడలో రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం. నిన్న అత్తగారితో సహా వచ్చాను. శాంత బహుశ మా ఆఫీసులో ఉద్యోగం చేస్తుంది. రఘుపతి విద్య నిరాటంకంగా సాగిపోతుంది. శాంత మీకు తీరికగా రాస్తుంది. లక్ష్మీకాంత్‌గారూ ఇప్పుడు నాకర్థమౌతుంది. శ్రీమతి స్వర్ణగార్ని మీరు వివాహం చేసుకున్నప్పుడు మీరు ఆనందపుటంచులవరకు విహరించి తన్మయులైపోయారు. నేను కూడా ఈ అనురాగబంధంతో తనివితీరా ఆనందిస్తున్నాను. మా వైవాహిక జీవితం నూరేళ్ళపంటలా వర్ధిల్లాలని ఆశీర్వదించగల సహృదయులు మీరు.."

స్వర్ణ తృప్తిగా విశ్వసించింది. ఆమె హృదయం దూదిపింజలా తేలికపడింది.

మరి వారం రోజులకు భార్యకు శుభలేఖ అందించాడు. లక్ష్మీకాంత్.

అది అశోక్ పెండ్లి పత్రిక.

స్వర్ణ వధువుపేరు తలితండ్రుల పేరు చూసి నిర్ఘాంతపోయింది. కాస్త ఆగి పగలబడి నవ్వింది.

"ఏం అంత నవ్వొస్తోంది. ఆ పెళ్ళి పత్రికలో అంత హాస్యం లిఖించబడి వుందా?" కాఫీ త్రాగుతూ హాస్యం చేశాడు లక్ష్మీకాంత్.

"ఆ.. అంతకన్నా ఎక్కువగానే వుంది. నెల్లూరులో మేం చదివేరోజుల్లో ఈ అమ్మాయి సుజాత పేరు ప్రఖ్యాతులు గాంచిందిలెండి. ఒట్టి ప్రేమలేఖలే కాదు. ఇష్టమొచ్చినట్లు తిరిగేది. విరగబడి మాట్లాడేది. అందగత్తె కాకపోయినా ఓ

మోస్తరుగా వుండేది. ఆమె కథ చెప్పాలంటే కొన్నిరోజులు పడ్తుంది. అంతేకాదు – అందరికన్నా ఓ మెట్టు పైకే వెళ్ళిందని చెప్పాలి. శాంతను ఏమేమో అన్నవాడు సుజాతను చేసుకుంటుంటే నవ్వురాక.. ఏమండీ రాగానే అతడి ముఖాన అడగాలి.."

లక్ష్మీకాంత్ గాభరాగా చూశాడు "అంతపని చేయకు. పాపం ఆ పిల్ల ఏమైపోతుంది?"

"ఉహూ. చెప్పాలి. సుజాత ఎలాంటిదో విడమర్చి చెప్పాలి. శాంతకన్నా ఎంత తక్కువదో తేలాలి. సుజాత ఆఘ్రాణిత పుష్పమని చెబుతుంటే అతని ముఖంలో మారే రంగులను చూచి నవ్వాలనివుంది. ఆమెను అతడిలాగ మోసం చేయటమేగాక ఆఘ్రాణించి నలిపి పారవేసిన వాళ్ళున్నారు. అటువంటి పుష్పం శిరోధార్యమైంది. ఇది వింటుంటే, అతని హృదయం రంపపు కోతకు గురి అవుతుంటే తనివిదీర నవ్వాలనివుంది. స్త్రీని చులకన చేయవద్దు. ఆమె ఆటవస్తువుకాదు. విసిగిపోయి పారవేయటానికి అన్నీ.. అన్నీ చెప్పాలి."

లక్ష్మీకాంత్ పెదిమలు హాసంతో వంపుతిరిగాయి.

"చాలా ఉద్రేకంతో మాట్లాడుతున్నావు. అందుకే చెబుతున్నాను. సుజాత ఆటవస్తువుకాదు. ఆమె ఒక స్త్రీ. అందుకే ఏమీ అనొద్దని చెబుతున్నాను."

స్వర్ణ మౌనంగా విన్నది. భర్త మాటలు హృదయంలో సోకి మెల్లగా నవ్వింది. "చెప్పనులెండి. కోపంతో అలా అన్నాను.." అంది. లక్ష్మీకాంత్ దీర్ఘంగా ఊపిరి పీల్చాడు.

"శాంత అదృష్టవంతురాలు స్వర్ణా. ఇతడి చేతిలో పడలేదు."

స్వర్ణ ముఖం వికసిత పుష్పమైంది. "ఒక్క శాంత అదృష్టాన్ని చెబుతున్నారా, నేను కూడా అదృష్టవంతురాలినే" అంటూ లోపలికెళ్ళి పోయింది.

ఆమె వెళ్ళిన దిక్కుగా చూస్తూ ఆనంద పారవశ్యంతో కళ్ళు మూసుకుని కుర్చీలో చేరగిలబడ్డాడు లక్ష్మీకాంత్.

COMMENTS